క్లుప్తంగా

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్



యువతికి టీకా వేస్తున్న వైద్యులు

జగిత్యాల: సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్‌తో చెక్ పెట్టవచ్చని, ప్రతీ ఒక్క యువతి వ్యాక్సిన్ వేసుకోవాలని ఐఎంఏ కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ అన్నారు. ఐఎంఏ హాల్‌లో శనివారం సర్వైకల్ క్యాన్సర్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్‌కు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ప్రతీ మహిళ ఈ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా క్యాన్సర్ నివారణకు తోడ్పడుతుందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రజిత మాట్లాడుతూ 9నుంచి45 ఏళ్ల వచ్చిన ప్రతీ మహిళ ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గోగికార్ సుధీర్, నవీన్, స్వరూప పాల్గొన్నారు.

భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు

మెట్‌పల్లిరూరల్: భద్రత విషయంలో విద్యుత్ సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని మెట్‌పల్లి రూరల్ ఏఈ రమేశ్ అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండవద్దని,అదే విధంగా సెఫ్టీ బెల్ట్,ఎర్త్‌రాడ్,హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు.అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ నరహరి,సిబ్బంది జలపతి,శివ,విష్ణువర్ధన్,రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై ఉద్యమించాలి

రాయికల్: ఆదివాసీల సమస్యల సాధన కోసం ఉద్యమించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ కౌన్సిల్ మెంబర్ చాడ వెంకట్‌రెడ్డిని శనివారం తోటి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సెంగ వేణు కలిసి ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. ఆదివాసీలు తోటి జాతిలో పడుతున్న బాధలను చాడ వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట రాయికల్ మండల నాయకులు కుర్సెంగ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాల ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్, మంక్యానాయక్ తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం సందర్భంగా శనివారం పోషకాహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు. అనంతరం పోషకాహార విలువలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, ఆశావర్కర్ సుమలత పాల్గొన్నారు.

పెగడపల్లిలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలి

పెగడపల్లి: మండల కేంద్రం పెగడపల్లిలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో 23 గ్రామాలుండగా సబ్ పోస్టాఫీస్ అందుబాటులో లేక తపాలా సేవలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మండల ప్రజలు సబ్ పోస్టాఫీస్‌కు ఏమైన పనుల నిమిత్తం వెళ్లాలంటే మల్యాల, గొల్లపల్లి, రామడుగు, ధర్మారం మండల కేంద్రాల్లో ఉన్న సబ్ పోస్టాఫీసులకు వెళ్లి సేవలు వినియోగించుకుంటున్నారు. మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు అన్ని సేవలు అందుతాయని, వెంటనే ఇక్కడ సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇరువురిపై కేసు నమోదు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన తాడూరి అనిల్, సామల రవి ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా, ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తాడూరి అనిల్, సామల రవి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇరువురి మధ్య మరోసారి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకోగా, ఇద్దరూ గాయపడ్డారు. ఇరు కుటుంబాల సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తారురోడ్డు రాదు.. దూర భారం తప్పదు

- ఏళ్లుగా తారురోడ్డు కోసం ఎదురుచూపు
- కబ్జాలకు గురవుతున్న కొచ్చగుంట రోడ్డు
- కలగానే ఈదులలింగంపేట రోడ్డు



భీమారం మండల కేంద్రం నుంచి - ఈదుల లింగంపేట వెళ్లే ప్రధాన రోడ్డు

మేడిపల్లి: దశాబ్దాలుగా ఆ గ్రామానికి తారురోడ్డు కలగానే మిగులుతోంది. మండలంలోని ఈదుల లింగంపేట గ్రామస్తులకు రోడ్డుసౌకర్యం దక్కడం లేదు. భీమారం మండల కేంద్రం నుంచి ఈదుల లింగంపేట గ్రామానికి వెళ్లాలంటే కొచ్చగుట్ట రోడ్డే ప్రధాన మార్గం,. కానీ ఈ మార్గం మట్టిరోడ్డు రావడంతో వర్షాకాలం రాకపోకలకు వెసులుబాటు ఉండదు. రోడ్డు ఇరువైపులా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కానీ రోడ్డు నిర్వహణ లేకపోవడంతో చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వచ్చి రాకపోకలకు ఇబ్బంది అవుతోంది.

భీమారం మండల కేంద్రానికి ఈదుల లింగంపేట గ్రామం ఆనుకుని ఉంటుంది. కానీ మండల కేంద్రానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో దాదాపు 7 కిలో మీటర్లు దూరం ప్రయాణం చేసి దేశాయిపేట లేదా మన్నెగూడెం గ్రామాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లుతున్నారు. సుమారు 4 కిలోమీటర్ల కొచ్చగుట్ట రోడ్డుపై తారురోడ్డు వేస్తే మండల కేంద్రానికి వెళ్లేందుకు దూరం తగ్గుతుంది. సుమారు 33 ఫీట్ల మట్టిరోడ్డు ప్రస్తుతం ఉండగా, కొన్ని ప్రాంతాల్లో భూ కబ్జాలతో కుదించుకుపోతుంది. కొచ్చగుట్ట రోడ్డు ఈదుల లింగంపేట వెళ్లే ప్రాంతంతో వ్యవసాయ భూములు అధికంగా ఉండటంతో వర్షాకాలంలో రైతులు పొలాలకు వెళ్లడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఈదుల లింగంపేట గ్రామం వడ్డెర కాలనీ నుంచి రెండు కిలోమీటర్ల మట్టిరోడ్డుని తారురోడ్డుగా మార్చితే మండల కేంద్రానికి తొందరగా వెళ్లోచ్చు. కానీ సరైనా రోడ్డు మార్గం లేక, మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తారు రోడ్డు వేయాలని కోరుతున్నారు.

వర్షాకాలం చాలా ఇబ్బంది



మా గ్రామ పొలిమేర భీమారం మండల కేంద్రానికి ఆనుకుని ఉంటుంది. మండల కేంద్రానికి వెళ్లాలంటే కొచ్చగుంట రోడ్డు గుండా ప్రయాణం సాగించేవాళ్లం. కానీ ఆ రోడ్డు మట్టిరోడ్డు కావడంతో వర్షాకాలంలో రాకపోకలకు సాధ్యం కాదు. అందుకే భీమారంవెళ్లాలంటే అటు దేశాయిపేట, ఇటు మన్నెగూడెం గ్రామాల మీదుగా వెళ్తున్నాం.

– పుప్పాల కొమురయ్య, మాజీ ఎంపీటీసీ, ఈదుల లింగంపేట

చాలాసార్లు విన్నవించాం



భీమారం నుంచి ఈదుల లింగంపేట గ్రామానికి వెళ్లాలంటే కొచ్చగుట్ట రోడ్డు ప్రధాన మార్గం, సుమారు 4 కిలోమీటర్లు ఉంటుంది. మట్టి రోడ్డు కావడంతో లోడ్‌తో వెళ్లే వాహనాలు వెళ్లడం కుదరదు. ఈ రోడ్డు గురించి ప్రజా ప్రతినిధులకు చాలాసార్లు వివరించాం. తారు రోడ్డు కావాలనేది రెండు గ్రామాల ప్రజల చిరకాల కోరిక.

– చెక్కపల్లి రఘు, భీమారం

తారు రోడ్డు నిర్మించాలి



మాది భీమారం మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న కమ్మరిపేట. ఈదుల లింగంపేట వెళ్లే కొచ్చగుట్ట రోడ్డు మార్గంలో నాకు వ్యవసాయ భూమి ఉంది. రోజు ఈదుల లింగంపేట గ్రామస్తులతో పాటు, ఇటు వైపు ఉన్న రైతులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటారు. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. తారు రోడ్డు నిర్మిస్తే, రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

– అడువాల రాజేశం,రైతు, కమ్మరిపేట

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



ధర్మపురిలో మాట్లాడుతున్న కాంతకుమారి

ధర్మపురి/గొల్లపల్లి: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి ప్రొఫెసర్ కాంతకుమారి అన్నారు. పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.బాలిక విద్య సాధికారత అనే శీర్షిక ఆధారంగా నిర్వహించిన కార్యక్రమంలో కాంతకుమారి ప్రసంగించారు. బాలికలు జనాభలో బాలురతో సమానంగా ఉన్నప్పటికి విద్య, ఉద్యోగాలు సాధించడంలో ముందుండాలని సూచించారు. బాలికలు ఉన్నత చదువులు చదివి వారి మీ లక్ష్యాన్ని మీరే ఎంచుకుని సాధించాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా పట్ల, సెల్‌ఫోన్ వాడకం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, లీడ్ ఇండియా శిక్షణ తెలంగాణ మేనేజర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచాలన్



ధర్మపురిలో పథ సంచాలన్‌లో సేవకులు

ధర్మపురి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పద సంచలన్ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు పట్టణ పుర వీధుల గుండా పథ సంచాలన్ ర్యాలీ చేపట్టారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే విస్తృతమైన పనులు, పట్టణంలోని ప్రతి గృహాన్ని కలిసి సంఘ ఆలోచనను తెలియజేస్తే జనజాగరణ కార్యక్రమం ఉంటుందని వక్తలు అన్నారు. కార్యక్రమంలో స్వయం సేవకులు రంగు లక్ష్మీనర్స య్య, సంగి నర్సయ్య, నేరెల్ల తిరుపతి, సత్యం, మహేందర్, గనవేశ దారి స్వయం సేవకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధినిచ్చే విధంగా చదవాలి

జగిత్యాల: విద్యార్థులు ఉద్యోగాల కోసమే కాకుండా పది మందికి ఉపాధినిచ్చే విధంగా విద్యనభ్యసించాలని ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నాయని, ఈ కోర్సుల్లో లోకల్ టు గ్లోబల్ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉమ్మడి జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గమ్య అండర్ - 17 బాలికల వాలీబాల్ ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. అలాగే బాలుర వాలీబాల్ జట్టుకు స్టాండ్‌బాయ్‌గా గౌతమ్ ఎంపికైనట్లు తెలిపారు. కాగా, ఎంపికైన క్రీడాకారులు సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో జరుగనున్న ఉమ్మడి జిల్లా పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం ప్రిన్సిపాల్ లతాదేవి, ఏఎంసీ చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

మల్యాల విద్యార్థి ఎంపిక

మల్యాల:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివకుమార్ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనుపమ తెలిపారు. అండర్–17 వాలీబాల్ విభాగంలో శివకుమార్ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి, ఉమ్మడి జిల్లాకు ఎంపిక కావడంపై పీడీ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కథలాపూర్:మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ మనీశ్ అనే పదోతరగతి విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. జగిత్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ కబడ్డీ క్రీడల్లో మనీశ్ ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం రాజయ్య, పీడీ నవీన్‌కుమార్ అభినందించారు.

కరాటేలో గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించిన యువకులు

పెగడపల్లి: చెన్నైలో కరాటే మార్షల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నీస్ వరల్డ్ రికార్డ్ అటెంప్ట్‌లో పెగడపల్లి యువకులు ప్రతిభ చాటారు. మండల కేంద్రానికి చెందిన క్యాస రాజశేఖర్, మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన గాజుల రాకేశ్ కరాటే గిన్నీస్ వరల్డ్ రికార్డులో పాల్గొని మార్షల్ ఆర్ట్‌లో ప్రతిభ కనబరుచడంతో గిన్నీస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. దీంతో వీరిని ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వసంత్ కుమార్ అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

మాజీ కౌన్సిలర్ ఇంటి ఎదుట నిరసన

మెట్‌పల్లి: పట్టణంలోని 23వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి మొరం తరలింపును అడ్డుకుంటున్నాడని ఆరోపిస్తూ పలువురు ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు శనివారం ఆయన ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకునే తాము మొరాన్ని తరలిస్తున్నామన్నారు. అయినప్పటికీ బుచ్చిరెడ్డి తనకు డబ్బులు ఇవ్వాలని అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ఆయన తీరుతో తమ ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలే తప్ప ఇలా చేయడం సరికాదని సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి

కోరుట్ల: రాష్ట్రంలో బీసీ కులాల హక్కుల కోసం ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో శనివారం జాతీయ బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు బాలె అజయ్, డివిజన్ సెక్రటరీ తుపాకుల బాజన్నలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 09 ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొందరు బీసీ వ్యతిరేకులు కోర్టుల్లో కేసులు వేసి రిజర్వేషన్లపై కోర్టు స్టే విధించటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్ల వెంకటేశ్వర్లు, శంకర్, శ్రీనివాస్, మహేశ్, వెంకట్ రెడ్డి, బార్గవ్, మమత, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వారోత్సవాలు

గొల్లపల్లి: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ అయిల్నేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టం అనేది దేశంలోని ప్రతి పౌరుడికి లభించిన అత్యంత శక్తివంతమైన సాధనమని, ఇది ప్రభుత్వ కార్యకలాపాలలో పారదర్శకతను పెంచి, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ చైర్మన్ నక్క గంగారాం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ నక్క రమేశ్, జగిత్యాల జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ పద్మ, జగిత్యాల జిల్లా మహిళ కన్వీనర్ శైలజ, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి సంగం ముత్తయ్య, గొల్లపల్లి మండల ప్రెసిడెంట్ నరహరి, చంద్రయ్య, సతీశ్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మల్యాల: మండలంలోని పోతారంసబ్‌స్టేషన్‌లో పరిధిలోని పోతారం, రాజారం గ్రామాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఆకునూరి శ్రీనివాస్ తెలిపారు.

మెట్‌పల్లి పట్టణంలో

మెట్‌పల్లి: పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఏ అమరేందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆమె నేత్రాలు సజీవం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో నివాసం ఉంటున్న జోగు కొమరమ్మ(48) శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. కుటుంబ సభ్యులు మృతురాలి నేత్రాలను దానం చేయడానికి ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ ప్రదీప్‌తో నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంకుకు తర లించారు. సమాజహితం కోసం ఆలోచించి ఇద్దరి అంధులకు చూపు ప్రసాదించాలన్న ఉద్దేశంతో నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు భర్త సారయ్య, కుమారులు వంశీకృష్ణ, అరుణ్, కూతురు ప్రగతిని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, తదితరులు నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఐఎం కార్యకర్తలు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పట్టణ ఎంఐఎం ఆధ్వర్యంలో ఆస్పత్రి ముందు శనివారం ధర్నా చేపట్టారు. 100 పడకల ఆస్పత్రి ప్రారంభించి రెండేళ్లయినా ఎలాంటి పరికరాలు, సామగ్రి సమకూర్చక భవనం నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రఫీ, అబ్దుల్ వాజిద్, మోహమ్మద్ నిజామెద్దీన్, రహీం, కలీం, సురేశ్, హఫీజ్, సల్మాన్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని దూలూర్ లో మెయిన్ రోడ్డు పక్కన డ్రైయినేజీ కూలింది. దీంతో మురికి నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. మురికినీరు నిల్వ ఉంటే దోమల బెడద ఉంటుందన్నారు. మరోవైపు భారీ వాహనాలు వెళ్లితే టైర్లు అందులో ఇరుక్కుపోయే ప్రమాదముందన్నారు. అధికారులు చొరవ చూపి కూలిన కొత్త డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంకర్,ఎంపీడీవో, కథలాపూర్, సెల్ నంబర్: 9281481652

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సీఐటీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సారంగాపూర్: ఈ నెల 14న గొల్లపల్లి లో జరిగే సీఐటీయూ గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మికులు అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. గొల్లపల్లి మహాసభతో పాటు, అక్టోబర్ 24,25న మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు స్టేను వెకెట్ చేయించాలి

పెగడపల్లి: కోర్టులను వేదికగా చేసుకొని రిజర్వేషన్లను అడ్డుకోవడం సమంజసం కాదని రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను సుప్రీం కోర్టులో వెకెట్ చేయించాలని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టే బీసీల వ్యతిరేక చర్యగా భావించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక మధు, అశోక్, సందీప్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాయికల్: పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీతో పాటు, మున్సిపల్ పార్క్‌ను సందర్శిస్తారని సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి

రాయికల్: తలసేమియా బాధితుల పిల్లల కోసం ఈనెల 26న కరీంనగర్‌లో శ్రీనివాస్‌ల మిత్రుల ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో పోస్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో గాజుల శ్రీనివాస్‌మండల ఇన్‌చార్జి కట్కం శ్రీనివాస్, గడ్డాల శ్రీనివాస్, ఉడుత శ్రీనివాస్, గుర్రాల శ్రీనివాస్, మోర శ్రీనివాస్, అంకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల సాయం

ధర్మపురి: ధర్మపురికి చెందిన శనిగరపు అశోక్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడు నిరుపేద కుటుంబం కావడంతో 1998–1999 ఎస్సెస్సీ మిత్ర బృందం ఆధ్వర్యంలో శనివారం మృతుడి కుటుంబానికి రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు.

యాదవుల సంక్షేమానికి నిరంతర కృషి

గొల్లపల్లి: జిల్లాలో యాదవుల ఐక్యతకు, యాదవుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని యాదవ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ అన్నారు. మండలంలోని నందిపల్లెలో శనివారం సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. యాదవుల సమస్యల పరిష్కారం, న్యాయంగా యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన విషయాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పన్నాల హరీష్ యాదవ్, దోరగాండ్ల జగన్ యాదవ్, జుర్రు శ్రీనివాస్ యాదవ్ మోతుకు మహేష్ యాదవ్, గడ్డం తిరుపతి యాదవ సంఘం పెద్దమనుషులు, సభ్యులు అత్తిని మల్లయ్య, ఎక్కల్ దేవి లక్ష్మన్, ఎక్కల్ దేవి భూమేశ్, ఏసాల రాజేందర్, ఎక్కలదేవిగంగామల్లు ఎక్కల్ దేవి వెంకటేశ్ కారు సుజాత పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా ముగ్గురికి గాయాలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామ శివారులో శనివారం సాయంత్రం ఇటుకను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడగా... ముగ్గురు ఒడిశా కార్మికులకు గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గంభీర్‌పూర్ నుంచి ఇటుకను తాండ్ర్యాల వైపు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, కార్మికుడు బిజయ్‌కు ఎడమ కాలు విరిగిందని, అజీజ్, గౌతమ్ అనే వ్యక్తులకు స్వల్పంగా గాయాలయ్యాయన్నారు. గాయాలపాలైన వారిని అంబులెన్స్‌లో కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

17న బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 17 శుక్రవారంనిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని, భక్తులు, నాయకులు, పాల్గొనాలని కోరారు.

అల్లీపూర్‌లో బీసీ కుల సంఘాల ర్యాలీ

రాయికల్: స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు అనుకూలంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి మండలంలోని అల్లీపూర్‌లో బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా పార్టీలు మద్దతివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సతీశ్, ముకీద్, రాజలింగం, వెంకటేశ్, అనుమల్ల మహేశ్, వెంకటేశ్, గణపతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు పప్రారంభమయ్యాయని వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మాజీ వ్యవసాయ వర్సిటీ సభ్యులు పూడూర్ రామ్ రెడ్డి, రైతులు కోరారు. చారు. మండలం లాంటి నాన్ ఆయకట్టు ప్రాంతం కాబట్టి గ్రామాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని, అకాల వర్షాలు కురిసినట్లయితే వర్షానికి ధ్యానం తడవకుండా టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేసి రైతులు మద్దతు ధరకు అమ్ముకునేలా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కథలాపూర్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని కథలాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు బద్దం మహిపాల్‌రెడ్డి, ముస్కు కృష్ణారెడ్డి, ప్రిన్స్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కథలాపూర్‌లో మాట్లాడారు. మొక్కజొన్న పంట చేతికొచ్చి 15 రోజులు గడిచిందని, అయినప్పటికీ కొనుగోలు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వర్షంతో మొక్కజొన్న తడిసిపోయి రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ధాన్యం దళారుల పాలు కాకుండా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి త్వరగా కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు.

మద్యం దుకాణాలకు 49దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని 71 మద్యం దుకాణాలకు 49 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ శనివారం తెలిపారు. దరఖాస్తుదారులు నేరుగా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదిస్తే సలహాలు, సూచనలు అందిస్తారని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.